# యాక్సిడెంటల్ జై

- కొలపల్లి ఈశ్వర్



నా కారు పిప్పిపిప్పి అయింది.

అంత పెద్ద ఏక్సిడెంట్ జరిగినా కూడా - నేను ప్రాణాల్తో బయటపడగలిగానూ అంటే..... నిజంగా అది దైవ కృపే! ఏవో రెండు మూడు చిన్న చిన్న గాయాలు తప్ప - కనీసం కాలో చెయ్యో అయినా విరగలేదు. నాకు ఎంత అదృష్టం?!

పొద్దున్న ఇంట్లోంచి బయటికొచ్చినప్పుడు - కారు కాంపౌండ్ దాటి బయటికొస్తుండగా, నిండు నీళ్ల కడవతో ఓపండు ముత్తైదువ ఎదురయ్యింది నాకు.

అప్పుడే అనుకున్నాను. ఇవ్వాళేదో శుభం జరిగే తీర్తుందని.

అనుకున్నట్టుగానే జరిగింది.

ఘోరమైన ఏక్సిడెంట్!

కారు తుక్కు తుక్కైపోయింది. అదసలు కారో, లేక ఇనప ముద్దో తెలీనంతగా - తెలుసుకోలేనంతగా - డేమేజ్ అయిపోయింది.

కానీ నాకు మాత్రం ఏమీ కాలేదు.

రియల్లీ గాడ్ ఈజ్ వెరీ వెరీ గ్రేట్!

నాకు కించిత్తైనా హాని జరగనందుకు ఎంత ఆనందం కలిగిందో - నా కారలా పచ్చడి పచ్చడైపోయినందుకు కూడా అంతే ఆనందం కలిగింది నాకు.

ఈ సంగతి మా ఆవిడకు తెలిస్తే ఎంత సంతోషిస్తుందో కదా అనుకున్నాను.

నేననుకున్నట్టే ఏక్సిడెంట్ స్పాట్ నుండి వేరే వెహికల్‌లో ఇంటికెళ్లి మృదులకి విషయం చెప్పగానే ఎగిరిగంతేసింది తను.

"నిజంగానా? నిజంగా మన కారు పిప్పిపిప్పయిపోయిందా?" అంటూ ఒకటే చప్పట్లు కొట్టడం.

కారుకి పట్టిన దుర్గతికి అలా సంతోషించడం అయ్యాక - అప్పుడడిగింది నన్ను - "మీకు దెబ్బలేం తగల్లేదు కదా?" అని.

"చూస్తూనే ఉన్నావ్‌గా!? నేను లక్షణంగా వున్నాను. నాకేం కాలా! నీకేవన్నా డౌటుంటే నా కాళ్లు చూస్కో - ముందుకే తిరుగున్నాయ్" అంటూ జోక్ చేశాను.

నా జోక్కి చిన్నగా నవ్వి, ఆ మీదట మళ్లీ కారు సంగతెత్తింది మృదుల.

"ఆ కారింక పనికిరాదా?!" అంది ముఖాన్ని చింకి చేటంత చేస్కుంటూ.

"ఎందుకు పనికిరాదూ? కేజీ అర్థరూపాయి చొప్పున పాతినుముగా అమ్ముకోడానికి బేషుగ్గా పనికొస్తుంది" అన్నాను మళ్లీ జోక్ చేస్తూ.

## నా రూట్ వేరు

ప్రీతీజింతా చాలా గట్స్ ఉన్న అమ్మాయి. ఏమ్మాట్లాడ్డానికైనా సంకోచించదు. 'కేజినో' అనే బుక్‌లో రాబర్ట్ డేనీరో చెప్పినట్లు... ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ మూడు దారులున్నాయి. మొదటిది మంచిదారి. రెండవది చెడ్డదారి. మూడవది నా దారి. ఈ మూడుదారుల్లో నేనెప్పుడూ నా దారినే ఎంచుకుంటాను అంటోంది. అందుకే అంత హాపీగా ఉండగలుగుతుంది ప్రీతి.



నా ఈ రెండో జోక్కి అసలే మాత్రం నవ్వకుండా -

"వెరీ గుడ్! అంతగా సకల నాశనమై పోయిందా?" అంది సంతోషంగా.

మృదుల సంతోషాన్ని చూస్తుంటే నాక్కూడా చాలా చాలా సంతోషంగా అనిపించింది.

"మొత్తానికి నీ కోరిక నెరవేరిందోయ్" అన్నాను తన బుగ్గ మీద చిటికేస్తూ.

"అంతా మన అదృష్టం! ఇవ్వాళ మీరు లేచిన వేళా విశేషం బాగుంది" అంటూ నవ్వి - "ఉండండి ఈ శుభవార్త అందరికీ చెప్పొస్తాను" అని మా పెద్దబ్బాయి గదిలోకి పరుగు తీసింది.

కాసేపటికి వాడొచ్చాడు. "ఏంటి డాడీ? మన కారు 'మటాష్' అటగా? నిజమేనా?!!" అంటూ....

వాడి ముఖం కూడా సంతోషంతో కళకళ్లాడి పోతూ వుంది.

"అవున్రా" అన్నాను చిరునవ్వు చిందిస్తూ.

దరిమిలా వాడుకూడా నాకేమీ కానందుకు తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

మరి కాసేపటికి మా చిన్నబ్బాయి, అమ్మాయి కూడా వచ్చారు.

వాళ్లు కూడా కారు స్మాష్ అయిపోయినందుకు బోలెడంత సంతోషాన్ని వ్యక్తం చేసి, ఆ పైన నాకేం కానందుక్కూడా కొంచెం సంతోషాన్ని వ్యక్తం చేశారు. లేకపోతే బావుండదని కాబోలు.

అటుపైన బోసి నోటితో నిండుగా నవ్వుతూ మా అత్తగారు కూడా ఎంటరైంది ఫ్రేమ్‌లోకి.

ఆవిడా అదే తంతు.

కారు నుజ్జు నుజ్జై నందుకు ఎక్కువ సంతోషాన్నీ నాకేం కానందుకు ఓ మోస్తరు సంతోషాన్ని వ్యక్తం చేసి వెళ్లింది.

చివరికి మా నౌకరు నారాయణ కూడా అదే రీతిలో సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

* * *

ఓ వారం తర్వాత.

పనులన్నీ చకచకా జరిగిపోయి, మా ఇంటి ముందు కొత్త 'మాటిజ్' కారు - బ్రాండ్ న్యూ కారు - ప్రత్యక్షమైంది.

"బుజ్జిముండ ఎంత బావుందో?" కొత్త కారు కేసి మురిపెంగా చూస్తూ అంది మా ఆవిడ.

"ముద్దొస్తూ వుందర్రా" అంది మా అత్తగారు బోసి నోటితో గాల్లోకో ముద్దు విసురుతూ.

"కలర్ అదిరింది" అన్నాడు మా పెద్దబ్బాయ్.

"సింప్లీ సూపర్బ్" అన్నాడు మా చిన్నబ్బాయ్.

"లవ్లీ" అంది మా అమ్మాయి.

నాకూ ఈ కొత్త కారు బానే నచ్చింది గానీ... ఎంతైనా పాత కారుతో ఎనిమిదేళ్ల అనుబంధం కదా - అందుకే అది గుర్తొచ్చి లోలోన బాధపడ్డాను.

ఏదేమైనప్పటికీ ఆ తర్వాత నేను కూడా మనస్ఫూర్తిగానే సంతోషించాను. ముఖ్యంగా పాత కారు మరెందుకూ పనికి రాకుండా అలా పచ్చడి పచ్చడైపోయినందుకు!

చనిపోతూ కూడా ఆ కారు నాకు ఉపకారమే చేసి పోయింది.

అదలా పూర్తిగా సర్వ నాశనమైపోబట్టే గదా - ఇన్స్యూరెన్స్ వాళ్లు పూర్తి అమౌంట్ ఇచ్చారు!? అందువల్లే కదా పైసా కూడా అదనపు ఖర్చు లేకుండా నేనీ కొత్త కారు కొనగలిగాను?

అందుకే - "ఏక్సిడెంట్ కీ జై!" అనరిచాను ఆనందంగా.

మా వాళ్లందరూ నాతో గొంతు కలిపారు అంతే ఆనందంగా!